విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 10, అక్టోబర్ 2023

కరెంట్ చార్జీలపై కదనానికి సై..

- ట్రూ అప్, సర్దుబాటు చార్జీల భారం తగ్గించాలి...
- స్మార్ట్ మీటర్ల బిగింపు నిలిపివేయాలి...
-వీధి సభలు, కరపత్రాలు పంపిణీ చేసిన వామపక్ష నేతలు

విశాలాంధ్ర బ్యూరో–అనంతపురం: విద్యుత్ చార్జీలు తగ్గించాలని, ట్రూ అప్ సర్దుబాటు చార్జీలు రద్దు చేసి స్మార్ట్ మీటర్ల బిగింపు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం పై కమ్యూనిస్టులు కదం తొక్కారు. ఈ మేరకు సోమవారం సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో నగర కార్యదర్శి శ్రీరాములు అధ్యక్షతన ఆపార్టీ జిల్లా కార్యదర్శి జాఫర్, సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, ఇతర వామపక్ష పార్టీల నాయకులు కార్యకర్తలు వీధి సభలు నిర్వహించారు. ముందుగా నగరంలోని పాతఊరు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం వద్ద నుండి వీధి సమావేశాలు ప్రారంభించి ప్రజలకు భారంగా మారిన విద్యుత్ చార్జీలు ఇతర సమస్యలపై కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఓ వైపు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటి ప్రజలు ఏదీ కొనలేని తినలేని పరిస్థితి ఉందని ఏకరువు పెట్టారు. ఇలాంటి పరిస్థతుల్లో వైసిపి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నడ్డి విరుస్తోందని అసహనం వ్యక్తం చేశారు. అధికారంలోకి వస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ ఛార్జీలు పెంచనని నమ్మబలికి ఓట్లు దండుకున్న సీఎం జగన్ మోహన్ రెడ్డి నేడు మాట తప్పి ప్రజలను ఆర్థిక సంక్షోభంలోనికి కూరుకు పోయేలా చేశాడని మండిపడ్డారు. ఇప్పటివరకు ఏడుసార్లు విద్యుత్ చార్జీలు పెంచాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు ఉచితంగా కరెంటు ఇచ్చిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తనయుడు సీఎం జగన్ నేడు వారి తండ్రి ఆశయాలను తుంగలో తొక్కాడని ఆక్రమంలోనే వ్యవసాయ పంపుసెట్లకు కరెంటు మీటర్లు బిగించి రైతుల మెడలకు ఉరితాళ్ళు బిగించబితున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ చార్జీలను తగ్గించకపోతే గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన బషీర్బాగ్ విద్యుత్ ఉద్యమాన్ని సీఎం జగన్ గుర్తుకు తెచ్చుకోవాని అప్పటి అమర వీరుల సాక్షిగా మిలిటెంట్ ఉద్యమానికైనా వెనుకాడమని హెచ్చ రించారు. వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించి రైతుల మెడలకు ఉరి తాళ్ళు బిగిస్తే రానున్న ఎన్నికల్లో బాధిత ప్రజలే వైసిపి కి ప్రజా క్షేత్రంలో ఉరి వేస్తారని దుయ్యబట్టారు. ప్రక్క రాష్ట్రాల్లో స్మార్ట్ మీటర్ కేవలం 7 వేల 9 వందల రూపాయిలకు కొనుగోలు చేస్తే ఏపీలో వైసీపీ ప్రభుత్వం స్మార్ట్ మీటర్ 13 వేల నుండి రూ.32 వేలకు కొనుగోలు చేసి ప్రజల సొమ్మును దోచుకుంటున్నాడని నిప్పులు చెరిగారు. ప్రజలు 2014లో వాడుకున్న కరెంటుకు ఇప్పుడు అధిక ఛార్జీలు వసూలు చేయడం దుర్మార్గమైన చర్య అని ఈ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యుత్ సంస్కరణలను ఏపి సీఎం జగన్ మోహన్ రెడ్డి ఆమోదించి రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేస్తున్నాడని దుమ్మెత్తి పోశారు. వ్యవసాయ పంపు సెట్లకు ఉచిత విద్యుత్ ను కొనసా గించాలని, 2022లో ప్రవేశ పెట్టిన విద్యుత్ సంస్కరణ బిల్లును వెంటనే ఉపసంహరిం చుకోవాలని డిమాండ్ చేశారు. మిలిటెంట్ ఉద్యమానికి వెనుకాడ మని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణ స్వామి, మల్లికార్జున, నగర సహాయ కార్యదర్శులు రమణ, అల్లిపీర, సీపీఎం నాయకులు వలి, వెంకటనారాయణ, సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదు

.. మనోధైర్యమే అన్ని సమస్యలకు పరిష్కారం

.. ఎస్పీ కే.కే.ఎన్ అన్బురాజన్

విశాలాంధ్ర–అనంతపురం వైద్యం: సమస్య ఉంటే దాని పరిష్కారం కూడా వెన్నంటే ఉంటుందని, ధైర్యం కోల్పోకుండా సమస్యలపై పోరాడాలని ఎస్పీ కే.కే.ఎన్ అన్బురాజన్ పేర్కొన్నారు. ఆత్మహత్య అనేది సమస్యలకు పరిష్కారం కాదని, ఎవరికైనా ఎలాంటి సమస్యలున్నా ప్రభుత్వం, పోలీసు శాఖ దృష్టికి తీసుకురావాలని, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు, ఇబ్బందులున్నాయని వాటిని ఎదుర్కోలేక క్షణికావేశంలో అర్థాంతరంగా తనువు చాలిస్తే కుటుంబాలు చిన్నాభిన్నమై భవిష్యత్తు అంధకారంలోకి వెళ్తుందని గ్రహించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో ఆత్మహత్య ఆలోచన దరిచేరనివ్వవద్దని ఎస్.పి విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా విద్యార్థులు ఏవైనా వారు చదువుతున్న విద్యా సంస్థలలో ఇబ్బందులు ఎదుర్కొంటుంటే ఆత్మస్థైర్యం కోల్పోకుండా సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. ఎవరికైనా ఎలాంటి సమస్యలు,ఇబ్బందులున్నా టోల్ ఫ్రీ నెంబర్లు 14416 లేదా 8008914416, తన ఫోన్ నెంబర్ 9440796800 (ఎస్పీ)కు ఫోన్ చేయాలని, వెంటనే సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా సర్వజన ఆసుపత్రిలో ప్రత్యేకంగా ఆత్మహత్యల నివారణ గురించి అవగాహన కల్పించేందుకు విభాగం (18వ నంబర్ ఓపి కౌంటర్) ఉందని... అక్కడికైనా నేరుగా వెళ్లడం లేదా పోలీసులను సంప్రదిస్తే ఆత్మహత్యను ఆపేవిధంగా చైతన్యం తీసుకొస్తారని తెలిపారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి ...

ఉరవకొండలో సిపిఐ, సిపిఎం ఆందోళన

విశాలాంధ్ర–ఉరవకొండ: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ సోమవారం ఉరవకొండలో సిపిఐ, సిపిఎం పార్టీలు స్థానిక తాహసిల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఆ పార్టీల నాయకులు మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చాక ఎట్టి పరిస్థితు ల్లోనూ విద్యుత్ ఛార్జీలు పెంచబోమని 200 యూనిట్ల వరకు కూడా ఫ్రీగా విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటివరకు ఏడు సార్లు పెంచారని పేర్కొన్నారు. సిఎం తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతులకు ఉచితంగా కరెంటు ఇచ్చారని గుర్తు చేశారు. ఆయన తనయుడు తండ్రి ఆశయాలకు తూట్లు పొడిచి వ్యవసాయ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించి రైతుల మెడలకు ఉరితాళ్ళు బిగించేందుకు సిద్ధమయ్యారని మండిపడ్డారు. కార్యక్రమంలో సిపిఐ పార్టీ

తాలూకా ప్రధాన కార్యదర్శి జే.మల్లికార్జున, మండల కార్యదర్శి తలారి మల్లికార్జున, వజ్రకరూరు కార్యదర్శి సుల్తాన్, మహిళా నాయకురాలు వన్నూరమ్మ, సిపిఎం జిల్లా నాయకులు రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ విప్లవ ధృవతార చేగువేరా

విశాలాంధ్ర – జేఎన్టీయూ ఏ: ప్రపంచ విప్లవ ధ్రువతార చేగువేరా వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి.జాన్సన్ బాబు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆనంద్ కుమార్, సంతోష్ కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, రమణయ్య, కుల్లాయి స్వామి నీలం రాజశేఖర్ రెడ్డి భవనంలో చేగువేరా చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొని ఉన్న అసమానతలు తొలిగిపోవాలని, సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తూ తన విప్లవ మేదస్సుతో అగ్రరాజులను తొక్కిపెట్టిన విప్లవజ్యోతి

చెగువేరా అన్నారు.కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధి కారి హనుమంతు, నగర అధ్యక్షులు ఉమామహేష్, జిల్లా ఉపాధ్యక్షులు వంశీ, నగర నాయకులు మంజు, విస్వ ప్రసన్న, ఆనంద్, ఏఐవైఎఫ్ నాయకులు దేవా వినయ్, నగర అధ్యక్షులు శ్రీనివాస్, లికిల్, శ్రీకాంత్, వేణు, శివ, దేవేంద్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికడదాం ..

విశాలాంధ్ర–శెట్టూరు: బాల్య వివాహాలు అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యతఅని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఫిరోజ్ ఖాన్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆర్.డి.టి, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమా నికి ముఖ్యఅతిథులుగా కంబదూరు ప్రాజెక్ట్ సిడిపిఓ వనజ అక్కమ్మ, ఆర్డిటి ఆదినారాయణ, ఎస్ఐ యువరాజు, మండల విద్యాధి కారి శ్రీధర్ హాజరై మాట్లాడారు. నేటి సమాజంలో బాలల పట్ల వివక్షత తీవ్రరూపం దాల్చిందని బాల్య వివాహాలు, బాలలపై లైంగిక వేధింపులు ఎక్కువ అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న వయసులో బాల్య వివాహాలు చేయడం వల్ల ఆడపిల్లలు మానసికంగా, శారీరకంగానూ తీవ్రమైన ఒత్తిడికి గురై ప్రసవ సమయంలో తల్లీ,బిడ్డ ప్రాణాలు కోల్పోతారన్నారు. ఆడ పిల్లలకు 18 ఏళ్ళ, మగ పిల్లలకు 21 ఏళ్ళ నిండకుండా వివాహం చేయాలని చూస్తే రెండు సంవత్సరాలు జైలు శిక్ష లేదా రూ.లక్షల జరిమానా లేదా రెండూ విధింపబడుతాయని పేర్కొన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే టోల్ ఫ్రీ నంబర్లు 1098,

100,112 లకు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటా రని తెలియజేసారు. కార్యక్రమంలో ఆర్డిటి ఏటీఎం భాష, పిహెచ్ఎన్ సరోజమ్మ, కేజీబీవీ ఎస్ఓ లలితమ్మ, ఉపాధ్యా యులు దివాకర్ రెడ్డి, మహిళా పోలీస్ బేబీ పాల్గొన్నారు.

గోదాముల్లో తనిఖీలు

విశాలాంధ్ర–అనంతపురం వైద్యం: ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలోని క్వారీలు, టపాసుల గోదాములలో పోలీసు అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిం చారు. రికార్డులు పరిశీలించారు. నిబంధ నల మేరకు మైనింగ్ చేయాలని, ఉల్లం ఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసు కుంటామని క్వారీల యజమానులను హెచ్చరించారు. అనధికారికంగా పేలుడు పదార్థాలు నిల్వ చేస్తే ఊరుకోమన్నారు.

సర్వర్ సమస్యను పరిష్కరించండి

విశాలాంధ్ర – అగళి: మండలంలో రేషన్ కార్డుదారులకు సరుకులు పంపిణీ చేయదానికి సర్వర్ మొరాయిస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురుకొంటున్నామరి వెంటనే సమస్యను పరిష్కరించాలని ఎండియు ఆపరేటర్లు సోమవారం తహసీల్దార్ జమానుల్లా ఖాన్‌కు వినతి పత్రం అందజేశారు. ఆపరేటర్లు మాట్లాడుతూ వారం రోజుల నుంచి సర్వర్ సమస్య తీవ్రంగా ఉండడం వల్ల రేషన్ కార్డు వినియోగదారులకు సక్రమంగా రేషన్ సరుకులను ఇవ్వలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తెల్లవారు జాము నుండే రాత్రి 10 గంటల వరకు ఇచ్చిన పదిమంది రేషన్ కార్డుదారు లకు సరుకులను పంపిణీ చేయలేకపోతున్నామని తెలిపారు. తాసిల్దార్ జమానుల్లా ఖాన్ స్పందించి పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసు కుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మంజునాథ్ విజయ్ కుమార్ మారుతి నరేంద్ర రమేష్ అభిలాష్ తదితరులు పాల్గొన్నారు

నాణ్యతగా పరిష్కారం చూపాలి.. కలెక్టర్ గౌతమి

విశాలాంధ్ర–అనంతపురం వైద్యం: జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్ అర్జీలను నిర్దేశిత గడువులోపే పరిష్కరించాలని కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ తోపాటు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, డిఆర్ఓ గాయత్రీ దేవి, ఆర్డీఓ మధుసూదన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, ఆన్ సెట్ సిఈఓ కేశవనాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారుల పాల్గొన్నారు. కలెక్టర్ ప్రజల నుంచి 468 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం, స్పందన అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలన్నారు. జిల్లాలో 9 రకాల థీమ్స్ కు సంబంధించి 2023 మార్చి వరకు పురోగతి ఎంత వరకు ఉందో పక్కా డేటా సేకరించి ఈగ్రామ్ స్వరాజ్ పోర్టల్లో నెలాఖరులోగా అప్లోడ్ చేయాలన్నారు. ఆయా శాఖల అధికారులు ఈ విషయమై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఓ ప్రశాంత్ కుమార్, డిఆర్డిఏ పిడి నరసింహారెడ్డి, డ్వామా పిడి వేణుగోపాల్ రెడ్డి, డీపీఓ ప్రభాకర్ రావు, ఇన్చార్జి డిఈఓ నాగరాజు, సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదన్ రావు, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర, డిసిహెచ్ఎస్ పాల్ రవికుమార్, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, ఐసిడిఎస్ పిడి శ్రీదేవి, డిఎస్ఓ శోభారాణి, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రమణారెడ్డి, ఎల్డిఎం సత్యరాజ్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ నాగరాజ్ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే విజ్ఞానం..

విశాలాంధ్ర మొబైల్ బుక్ హౌస్ ప్రారంభించిన ఎంపీడీవో

విశాలాంధ్ర–ఉరవకొండ: పుస్తక పఠనంతో విజ్ఞాన అభివృద్ధి సాధ్యపడు తుందని ఉరవకొండ ఎంపీడీవో అమృతరాజ్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా విశాలాంధ్ర మొబైల్ బుక్ హౌస్‌ను ఆయన ప్రారంభించారు. విశాలాంధ్ర మొబైల్ బుక్‌హౌస్‌లో అనేక పుస్తకాలు ఉంటాయని, ఈ పుస్తకాలను పఠించడం వల్ల ప్రతిఒక్కరిలో విజ్ఞానం మెరుగు పడుతుందని అన్నారు. ప్రధానంగా ఆరోగ్యం, విజ్ఞానం, పర్యా వరణం, మేధాశక్తిని పెంపొందించే వివిధ రకాల పుస్తకాలు వంట కాల పుస్తకాలు, ఆరోగ్యానికి సంబంధించిన వివిధ చిట్కాలు తెలిపే పుస్తకాలు, చిన్న పిల్లలకు వినోదాన్ని కలిగించే బొమ్మల పుస్తకాలు, నవలలు అందు బాటులో ఉన్నా యని తెలిపారు. విశాలాంధ్ర నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఉరవకొండలో నాలుగు రోజులు పాటు విశాలాంధ్ర మొబైల్ బుక్‌హౌస్ అందుబాటులో ఉంటుందని, లాభాపేక్ష లేకుండా కేవలం పాఠకుల మేధాశక్తిని పెంపొందించడం కోసం మొబైల్ బుక్ హౌస్ ఉందని తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పరిశీలన..

విశాలాంధ్ర–అనంతపురం వైద్యం: జిల్లా వైద్యం, ఆరోగ్య శాఖ అధికారి డా ఈ.బి దేవి పుట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ,సెనగలు గూడూరు, పెద్దపప్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పసలూరు తాడిపత్రి. రురల్ ఎర్రగుంటపల్లి వై ఎస్ ఆర్ సోమవారం విలేజ్ హెల్త్ క్లినిక్స్ నందు జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష పరిశీలించారు. వైద్య సిబ్బందికి తగిన సలహాలు సూచనలు చేశారు. జిల్లాలో ఈ రోజు జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 2,257 మంది వైద్య సేవలు తీసుకోగా 548 వైఎస్ఆర్ కంటి వెలుగు క్రింద వైద్య సేవలు పొందారని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం క్రింద 75మందిని మెరుగైన వైద్యం కోసం ఇతర ఆసుపత్రులకు పంపినట్లు చెప్పారు.

వ్యాసరచన వక్తృత్వ పోటీలు

విశాలాంధ్ర–యాడికి: మండల కేంద్రంలో విజన్ హై స్కూల్ నందు శ్రీ చౌడేశ్వరి ఖాది గ్రామీణ సంస్థ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఖాదీ మహోత్సవ కార్యక్రమాలలో భాగంగా భారత స్వాతంత్ర ఉద్యమంలో గాంధీజీ పాత్ర అనే అంశం నందు వ్యాసరచన పోటీలు మరియు స్వాతంత్రం ముందు, తర్వాత భారతదేశం అభివృద్ధి అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు చౌడేశ్వరి ఖాదీ గ్రామీణ సంస్థ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్య క్షుడు రఘు, హరి, బాలకృష్ణ, భార్గవ్, రవి, సురేష్ మరియు విజన్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. చౌడేశ్వరి ఖాదీ గ్రామీణ సంస్థ సభ్యులకు విజన్ హైస్కూల్ కరెస్పాండెంట్ విశ్వనాథ్ కృతజ్ఞతలు తెలిపారు.

నూతన విద్యుత్‌చట్టంతో తిప్పలు..

విశాలాంధ్ర–రాయదుర్గం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ భారం ఏవిధంగా మోపుతున్నాయో ప్రజలకు సీపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.నాగార్జున అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని పూర్తిగా ప్రైవేటీకరించేందుకు నూతన విద్యుత్ చట్టాన్ని తెచ్చిం దన్నారు. దేశంలో అందరికంటే ముందు అమలు చేసేందుకు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సిద్ధమైందని, వ్యవసాయ మోటా ర్లకు మీటర్లు పెట్టడం, స్మార్ట్ మీటర్ల పేరుతో ఆదాని కంపెనీకి వేల కోట్లు దోచి పెట్టడానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఇంధన సర్దుబాటు చార్జీలు, సర్‌ఛార్జిల ట్రూ అఫ్ సెస్ పేరుతో ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ.450 కోట్లు విద్యుత్ చార్జీలు పెంచి కోట్ల భారాన్ని ప్రజలపై వేసిందన్నారు. పంటలు లేక పెట్టుబడులు చేతికిరాక అప్ప కష్టాలతో కొట్టుమిట్టాడుతుంటే ఇప్పుడు విద్యుత్ చార్జీల బాదుడుకు సిద్ధమయ్యారని పేర్కొన్నారు.

పేదలకు ఇచ్చిన స్థలాల్లోనే ఇల్లు నిర్మించాలి..

విశాలాంధ్ర–ఉరవకొండ: ఉరవకొండ నియోజకవర్గం విడపనకల్లు మండల కేంద్రంలో గత నాలుగు సంవత్సరాల క్రితం గుంతకల్లుకు వెళ్లే రహదారిలో అర్హులైన 460 మంది పేదలకు సర్వేనెంబర్ 532 మరియు 530 సీలో 12 ఎకరాల భూమిలో పేదలకు పట్టాలు ఇచ్చారని, వాటిని ఇప్పుడు రద్దు చేస్తామని లబ్ధిదారులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని నోటీసులు జారీ చేయడంతో సోమవారం స్థానిక తాహసిల్దార్ కార్యాలయం ముందు సిపిఐ, టిడిపి నాయకులు లబ్ధిదారులతో కలిసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ తాలూకా నాయకులు చెన్నారాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను ఎందుకు రద్దు చేస్తారో పేదలకు సమాధానం చెప్పాలన్నారు. ఎన్నో సంవత్సరాల పోరాటాల తర్వాత 460 మంది పేదలకు ఇళ్ల స్థలాలు సాధించడం జరిగిందని అయితే వాటిని కూడా ప్రస్తుతం రద్దు చేస్తామని చెప్పడం పేదలకు అన్యాయం చేయడమేనని పేర్కొన్నారు. హద్దులు ఏర్పాటు చేసి లబ్ధిదారుల ఇల్లు నిర్మాణానికి సహకరించాలని

కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ తో పాటు టిడిపి నాయకులు హనుమంతు, సినిమా రామాంజనేయులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాల కోసం ధర్నా..

విశాలాంధ్ర–కూడేరు: పేదలకు అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో స్థానిక తాహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు నాగరాజు, కృష్ణ రాయడు మాట్లాడుతూ షరతులు లేకుండా పట్టణ ప్రాంతాల్లో మూడు సెంట్లు గ్రామీణ ప్రాంతాల్లో ఐదు సెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తాహసిల్దారు శేషారెడ్డికి అందజేశారు.

10వ తేదీన రౌండ్ టేబుల్ సమావేశానికి రండి

- దేశవ్యాప్తంగా పోలీసు దాడులను ఎదుర్కొంటున్న జర్నలిస్టులకు రచయితలకు మేధావులకు సంఘీభావంగా నిలుద్దాం

విశాలాంధ్ర–అనంతపురం వైద్యం: దేశవ్యాప్తంగా, కేంద్ర ప్రభుత్వ పోలీసుల సంస్థ లు , ప్రశ్నించే మేధావులపై కేసులు పెట్టడం చూస్తూ ఉన్నాము. కేసులు ఎదుర్కొంటున్న వారిలో, జర్నలిస్టులు, రచయితలు, కళాకారులు, వృత్తి నిపుణులు ఉన్నారు. కేంద్ర ప్రభుత్వాలను ప్రశ్నించడమే వారు చేసిన నేరం. ప్రజాస్వామ్యానికి ప్రశ్నే ప్రాణం. కానీ ప్రశ్నిస్తున్న వారికి ఈరోజు ముప్పు ఏర్పడుతున్నది. రాజ్యాంగం ఇచ్చిన భావ ప్రకటన స్వేచ్ఛ, పౌర హక్కులకు భంగం కలుగుతున్నది. మన అనంతపురంలో పౌర సమాజానికి సు పరిచితులైన, చంద్రశేఖర్(రిటైర్డ్ ప్రిన్సిపల్), అబ్దుల్ రసూల్(అడ్వకేట్) లాంటి వారు కూడా ఈ వేధింపులను ఎదుర్కొన్నారు. వారు మానవ హక్కుల కార్యకర్తలుగా ఉండటం కేంద్ర ప్రభుత్వం దృష్టిలో నేరమైంది. ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ, వీరికి సంఘీభావం తెలియజేస్తూ, మంగళవారం, సాయంకాలం నాలుగున్నర గంటలకు, ఎన్జీవో హోం లో జరిగే రౌండ్ టేబుల్ సమావేశానికి అందరినీ ఆహ్వానిస్తున్నాము.రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, పౌర సంఘాల కార్యకర్తలు, ప్రముఖులు హాజరై సంఘీభావం తెలియజేయాలని రాజ్యాంగ పరిరక్షణ వేదిక డాక్టర్ గేయానంద్ సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

డెంగీతో బాలుడు మృతి..

విశాలాంధ్ర–ఉరవకొండ: విడపనకల్ మండలం పాల్తూరు గ్రామం లో డెంగీ వ్యాధి బారిన పడి మారుతి (9) అనే బాలుడు మృతి చెందాడు. బాలుడికి తీవ్ర జ్వరం రావడంతో తల్లిదండ్రులు బళ్లారి ఓ.పి.డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో సోమవారం తెల్లవారు జామున బాలుడు మృతి చెందాడు. అయితే వారం రోజుల క్రితం ఇదే గ్రామంలో సుజాత అనే బాలిక కూడా మృతి చెందింది. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు చేపట్టిన కూడా ఎలాంటి ప్రయోజనం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు నిర్లక్ష్యంగా ఉన్నారని అన్నారు. గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మారుతి (ఫైల్)

ఎంఏ అడల్ట్ ఎడ్యుకేషన్ కోర్సు తొలగింపు విరమించుకోవాలి..

విశాలాంధ్ర–జెఎన్‌టియుఏ: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యా లయంలో అడల్ట్ ఎడ్యుకేషన్ కోర్సును ఎత్తివేయాలని తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, యూనివర్సిటీలో ప్రొఫెసర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలని యూని వర్సిటీ ఏడి బిల్డింగ్ ముందు ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఏ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేపట్టారు. రిజిస్టర్ లక్ష్మయ్యకి వినతిపత్రం అందజేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి.జాన్సన్‌బాబు, ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షులు వేమన, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమణయ్య, కుల్లాయిస్వామి మాట్లాడుతూ.. గ్రామీణ పేద విద్యార్థులు ఎంతో మందిని ఉన్నత స్థాయిలో నిలిపిన ఘనత ఎస్కేయూది.. పాలకుల నిర్లక్ష్యం కారణంగా ప్రతిష్టను కోల్పోతోంది.. ఒక్కొక్క విభాగాన్ని మూసివేయడానికి అధికారులు కుట్ర చేస్తున్నారని, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేరనే సాకు చూపడం దారుణమన్నారు. యూనివర్సిటీ సమస్యలపై గవర్నర్‌ను కలవబోతు న్నామని తెలిపారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి హనుమంతు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్, ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు ఉమా మహేష్, వంశీ, రజిని, సిద్దు బిమేష్, శివ, గిరి, రాజు నాయక్ వంశి, కృష్ణ, రాజేష్, ప్రసన్న, ఆనంద్, విశ్వ కార్తిక్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 10, అక్టోబర్ 2023

కృష్ణా జలాల పునఃపంపిణీ నిర్ణయాన్ని తక్షణం విరమించుకోవాలి..

- ఏపీ తెలంగాణల్లో 811 టీఎంసీలు యథాతథంగా ఉంచాలి..
- అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో, అనంతపురం
కృష్ణా జలాలను పునః సమీక్షించి పంపిణీ చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి- ఆంధ్రప్రదేశ్ (ఏవీఎస్ఎస్-ఏపీ) తీవ్రంగా వ్యతిరేకించింది. కరువు జిల్లాలకు ఎంతో నష్టం కలిగిస్తూ, రాజకీయ లబ్ధి కోసం కరువు ప్రాంతాలకు నష్టం కలిగించే, ముఖ్యంగా రాయలసీమ రైతులను అధోగతి పాలు చేసే ఈ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 12న జిల్లా కేంద్రం అనంతపురంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సమితి నాయకులు ప్రకటించారు. నగరంలోని జిల్లా ప్రెస్క్లబ్ లో సోమవారం "కృష్ణా జలాల పునః సమీక్షను వ్యతిరేకిద్దాం" పేరుతో ముద్రించిన కరపత్రాలను ఏవీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కే.వీ.రమణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆవిష్కరించారు

కృష్ణా జలాల్లో ఇప్పటికే ఇరు రాష్ట్రాల్లోని ప్రాజెక్టుల వారీగా వినియోగంలో ఉన్న 811 టీఎంసీలను యథాతథంగా ఉంచాలి.

అదనపు జలాలు, మిగులు జలాలను విభజన చట్టంలో పేర్కొన్న ప్రకారం రెండు రాష్ట్రాల కరువు పీడిత ప్రాంతాల ప్రాజెక్టులకు కేటాయించాలి.

కృష్ణా జలాల హక్కుల పరిరక్షణకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం క్షణం సుప్రీంకోర్టులో కేసు వేయాలి.

కృష్ణా యాజమాన్య బోర్డు (ఏఆర్ఎంబి)ను అసంబద్ధంగా విశాఖపట్నంలో ఏర్పాటు చేయడాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకుని, వెంటనే కర్నూలులో ఏర్పాటు చేయాలి.

రాయలసీమలోని కరువు పీడిత ప్రాంతాల్లో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తగినన్ని నిధులు కేటాయించి త్వరితగతిన పూర్తి చేయాలి.

రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పూర్తి చేయడంలో ఎదురవుతున్న అడ్డంకులను అధికమించి సిద్దేశ్వరం అలుగు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం కావాలని కోరారు.

ఈ సందర్భంగా అధ్యక్షులు కేవీ రమణ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇప్పటికే కేటాయించిన 512 టీఎంసీలకు అదనంగా, అత్యంత వెనుకబడిన కరువు సీమ రాయలసీమ ప్రాంతానికి మరో 150 టీఎంసీలను హక్కుగా పొందడం కోసం ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. 12వ తేదీ నిర్వహించే సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలకు, రైతులకు విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి గౌరవాధ్యక్షులు ఆలూరు రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజా హెసెన్నూర్, ఉపాధ్యక్షులు జి.నారాయణరెడ్డి, సంయుక్త కార్యదర్శి రాజేశ్వరి, కోశాధికారి కేపీ.కుమార్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు బండి సత్యనారాయణ రెడ్డి, కోదండరాం, మహమ్మద్ అలీ, ఇదే పేరు బన్నీ కక్కలపల్లి కాలనీ వెంకటేష్ పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టుపై గర్జించిన రెడ్లు

- చెన్నేకొత్తపల్లిలో టిడిపి రిలే దీక్షలకు మద్దతు పలికిన రెడ్డి సోదరులు
- ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధం : పరిటాల సునీత

విశాలాంధ్ర బ్యూరో- శ్రీసత్యసాయి: టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టుపై రెడ్డి సోదరులు కన్నెర్ర చేశారు. ఆయనది ముమ్మాటికి అక్రమ అరెస్టు అంటూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా తొలిసారిగా రాప్తాడు నియోజకవర్గం చెన్నేకొత్తపల్లిలో సోమవారం టిడిపి నాయకులతో రెడ్డి సోదరులు రిలే దీక్షలు చేపట్టారు. మండలంలో పలు గ్రామాల నుంచి నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి సంఘీభావం తెలిపారు.

రాప్తాడులో నీ సీటు ఉందో లేదో చూసుకో ప్రకాష్ రెడ్డి.. మాజీ మంత్రి పరిటాల సునీత...వచ్చే ఎన్నికల్లో నాతో పాటు శ్రీరామ్‌కు సీటు రాదంటూ ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి.. ముందు తన సీటు సంగతి చూసుకోవాలని మాజీ మంత్రి పరిటాల సునీత హితవు పలికారు. 30 రోజులుగా చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలకు ఎంతో మంది మద్దతు తెలుపుతున్నారన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మా రెడ్డి సోదరులు మద్దతు తెలపడం సంతోషంగా ఉందన్నారు. కనగానపల్లిలో కురుబలు వేల సంఖ్యలో వచ్చారని, కక్ష గట్టిన ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి 120 మందిపై అక్రమంగా కేసులు పెట్టించారన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి ఎన్నికల్లో ఓటమి భయం పుట్టుకుందని, అందుకే పోలీసుల ద్వారా ఇలా అణిచివేత ధోరణులు ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. రాప్తాడులో ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి దౌర్జన్యాలకు అడ్డువేద్దామని సునీత పిలుపునిచ్చారు..

పరిటాల రవీంద్ర, పరిటాల సునీత, ఇప్పుడు నా వరకు తాము ఎక్కడా రెడ్లకు వ్యతిరేకంగా పని చేసిందిలేదని పరిటాల శ్రీరాం అన్నారు.. కేవలం పేద ధనిక వర్గాల మధ్య మాత్రమే ఆ రోజు నుంచి గొడవలు జరుగుతున్నాయని శ్రీరాం అన్నారు. తమ వర్గాన్ని దెబ్బతీసిన వారిని, అలాగే దాడులు చేస్తున్న వారితో మాత్రమే మాకు శత్రుత్వం ఉందన్నారు. అంతేకానీ ఇదంతా రెడ్లకు ఆపాదించడం సరైన చర్య కాదన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మొట్ట మొదటిసారి తెలుగుదేశం పార్టీ చేస్తున్న ఉద్యమానికి రెడ్లు మద్దతు పలకడం ఇదే తొలిసారి అన్నారు. ఈ ఘనత చెన్నే కొత్తపల్లి మండలానికి చెందిన రెడ్లకు మాత్రమే దక్కుతుందన్నారు.

ఒక రెడ్డినైన నాకు 5సార్లు బీఫామ్ ఇచ్చిన పార్టీ టీడీపీ .. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి... టీడీపీలో ఎక్కడా కులాల తారతమ్యం లేదని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి అన్నారు. సీఎం జగన్ ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో 20 వేల మంది తెలుగుదేశం పార్టీ నాయకుల మీద కేసులు పెట్టారంటే ఏ స్థాయిలో అరాచకాలు సాగుతున్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు. సౌమ్యుడుగా పేరున్న నామీద కూడా అనేక కేసులు పెట్టారన్నారు అయినప్పటికీ వెనుకాడే ప్రసక్తి లేదని చంద్రబాబు నాయుడుని బయటికి వచ్చేవరకు మా పోరాటం ఆగదన్నారు. ప్రస్తుతం నాతో పాటు పరిటాల సునీత వంటివారికి పదవులు, రాజకీయాలు అవసరం లేదని కానీ మేమంతా కష్టపడుతున్నది ప్రజల కోసమేనన్నది గుర్తించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అవినీతికి ఆస్కారం లేని స్కిల్ డెవలప్మెంట్ కేసులో మొదట మూడువేల కోట్ల రూపాయలు అవినీతి జరిగిందన్నారని, ఆ తర్వాత 370 కోట్లు అని.. ఆ తర్వాత 250 కోట్లు అని.. ఇప్పుడు 27 కోట్ల రూపాయలకు వచ్చారని కొల్లు రవీంద్ర విమర్శించారు. పార్టీ శ్రేణులు విరాళం రూపంలో డబ్బు ఇస్తే అది అవినీతి అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డే వేయని ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో చంద్రబాబు లోకేష్ పై కేసులు పెట్టారని.. అమరావతి వద్దన్న జగన్ ఇప్పుడు అమరావతిలో అక్రమాలు జరిగాయని కేసులు పెడుతున్నారన్నారు. వీటన్నింటికీ రానున్న రోజుల్లో ఏం జగన్ తగిన మూల్యం చెల్లించుకుంటారన్నారు.

సిఎం జగన్‌ని రాష్ట్రంలో రెడ్లంతా వెలివేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. జగన్మోహన్ రెడ్డి రెడ్లకు ప్రతినిధి కాదు ఆయన వారిని ఉద్ధరించేవాడు కూడా కాదని అన్నారు. కడప జిల్లాలోని పులివెందులతో పాటు అనేక ప్రాంతాల్లో జగన్మోహన్ రెడ్డి కుటుంబం సాగించిన దమనకాండలు బలైందంతా రెడ్లే నని ఆయన అన్నారు. వారి అరాచకాలకు నేను కూడా బాధితుడేనన్నారు. జగన్ చేస్తున్న పనులవల్ల మొత్తం రెడ్డి జాతికే అవమానం కలుగుతోందన్నారు.

ప్రజాస్వామ్యవాదులంతా ఎక్కడున్నారు...
రాష్ట్రంలో ఏ సంఘటన జరిగినా బయటికి వచ్చే ప్రజాస్వామ్య వాదులంద చంద్రబాబు అరెస్టుపై ఎందుకు స్పందించడం లేదని చిలకం మధుసూదన్ రెడ్డి ప్రశ్నించారు. రెడ్లంతా జగన్ వైపే ఉన్నారనే ఒక అపోహను ఇప్పటికైనా తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. టిడిపి అధినేతను అక్రమంగా అరెస్టు చేస్తే మొత్తం అన్ని వర్గాల వారు రోడ్లపైకి వచ్చారని , రానున్న రోజుల్లో జనసేన టిడిపి కలసి పోరాడి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి బుద్ధి చెబుతాయన్నారు.

స్మశాన వాటికకు స్థలం కేటాయించాలి

విశాలాంధ్ర-ముదిగుబ్బ: మండలకేంద్రంలో స్మశాన వాటికకు ప్రభుత్వ స్థలం కేటాయించాలని కోరుతూ సోమవారం ముదిగుబ్బ రెవెన్యూ కార్యాలయం ఎదుట మండల సిపిఐ నాయకులు ఆందోళన చేపట్టారు. రెవెన్యూ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. సిపిఐ పార్టీ, మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జాతీయ మానవ హక్కుల రాష్ట్ర అధ్యక్షుడు బాసినేని వెంగ మేష్ చౌదరి, టిడిపి నాయకులు గోనుగుంట్ల కృష్ణమూర్తి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ మండల సహాయ కార్యదర్శి తిప్పయ్య, కార్యకర్తలు రాధాకృష్ణ, ఆదెప్ప , వెంకటనారాయణ, శంకర పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై ఏఐఎస్ఎఫ్ ఆరా

విశాలాంధ్ర- హిందూపురం: ముదిరెడ్డిపల్లిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐయస్‌యఫ్) సభ్యులు విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ మూర్తి, మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి, విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకున్నారు.

రైతు సంఘం కమిటీ ఏర్పాటు

విశాలాంధ్ర - హిందూపురం : హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని కొట్నూరు వార్డులోగల కమ్యూనిటీ హాల్ నందు సోమవారం కె.వీ. చలపతి అధ్యర్యంలో హిందూపురం మండల రైతు సంఘం కమిటీ ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా, ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ కాటమయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జే వి. రమణ , ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి. గోవింద్ రెడ్డి హాజరైయ్యారు. మండల కమిటీ అధ్యక్ష కార్యదర్శులు శ్రీరాములు, తిప్పనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితోపాటు ఏడు మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం చేపట్టండి..

విశాలాంధ్ర-ఓడిసి రూరల్: సున్నంపల్లి పంచాయతీలోని మహమ్మదాబాద్ క్రాస్ లోని బీసీ కాలనీ బుట్టు రామన్న కాలనీలోని వాసులు సిమెంట్ రోడ్డు లేక డ్రైనేజీ లేక గత కొంతకాలంగా ఇబ్బందులకు గురవుతున్నామని, వెంటనే పనులు చేపట్టాలని కాలనీవాసులు సోమవారం స్పందనలో ఎంపీడీఓ వరలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సిఐటియు మండల అధ్యక్షులు కుల్లాయప్ప, కార్యదర్శి పోరాటాల శ్రీరాములు, శంకర బాబు, రమణప్ప తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం

విశాలాంధ్ర-అమడగూరు: మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గల పెద్ద బజారు వీధిలోని కొందరు రోడ్డుపై ఇరువైపులా ప్రజలకు ఇబ్బంది కలిగేలా నిర్మాణాలు చేపట్టడంతో మండలంలోని ప్రజలకు, గ్రామదేవత చౌడేశ్వరి దేవి అమ్మవారి ఊరేగింపునకు చాలా ఇబ్బందిగా ఉందని సోమవారం గ్రామస్తులు సమస్యను గ్రామ సర్పంచ షబ్బీర్‌భాష దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సర్పంచ్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులను సంప్రదించి వారి ద్వారా అక్రమనదారులకు నోటీసులు అందజేసి 15 రోజుల గడువు ఇచ్చామని, అక్రమ కట్టడాలను తొలగించకపోతే తగు చర్యలు తీసకుంటామని ఎం.పి.డి.ఒ. మునెప్ప తెలియజేశారు. కార్యక్రమంలో ఎం.ఆర్.ఓ. వెంకట రెడ్డి, ఆర్ఐ ఈశ్వరయ్య, పిఓఆర్‌డి. నసీమా, పంచాయతీ కార్యదర్శి చంద్ర, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబుకు మద్దతుగా సంతకాల సేకరణ

విశాలాంధ్ర-ముదిగుబ్బ: సైకో వైసీపీ ప్రభుత్వం, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై అక్రమ కేసులు బనాయించిందని, ధర్మవరం మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ, వర్గీయులు విమర్శించారు. సోమవారం మండలంలోని మొలకలవేముల, సానివారిపల్లి పలు గ్రామాలలో, సూర్యనారాయణ వర్గీయులు ఇంటింటా తిరిగి సంతకాలు సేకరణ చేపట్టారు. వచ్చే ఎన్నికలలో నారా చంద్రబాబునాయుడుని గెలిపించుకోవాలని కోరారు.

పేద విద్యార్థినీ చదువుకు సహాయం

విశాలాంధ్ర-సెట్టూరు: మాకోడికి గ్రామానికి చెందిన గంగాధర్ మారెక్కకు 4గురు సంతానం.. కాగా ముగ్గురు అమ్మాయిలు ఉన్నారు. గంగాధర్ నాలుగేళ్ళ క్రితం మృతి చెందగా కుటుంబ పోషణ కష్టతరంగా మారింది. ఇదే క్రమంలో మొదటి కూతురు వివాహం చేసింది. రెండో కూతురు మల్లీశ్వరిని చదివించడం భారం కాగా పెళ్లి చేయాలని నిర్ణయించుకుంది. పెళ్లి చేయడానికి డబ్బులు లేక సహాయం చేయాలని మాకోడికి గ్రామ ఉపాధ్యాయుడుబద్యే నాయక్‌ను ఆశ్రయించింది. అనంతపురం నర్సింగ్ కళాశాలలో చదివించడానికి ఆయన హామీ ఇచ్చారు. రూ.32వేలు మల్లేశ్వరి చదువుకు ఆర్థిక సాయం చేశారు. నర్సింగ్ పూర్తి అయ్యే వరకు తనదే బాధ్యత అన్నారు. గ్రామస్తులు, ప్రజా సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు.

ముదిగుబ్బ ఎస్సైగా ఎన్.వంశీకృష్ణ..

విశాలాంధ్ర-ముదిగుబ్బ : ముదిగుబ్బ స్టేషన్ ఎస్సైగా ఎన్.వంశీకృష్ణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. వంశీకృష్ణ అనంతపూర్ టౌన్ నందు ట్రాఫిక్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ, బదిలీపై ముదిగుబ్బ ఎస్సైగా నూతనం గా బాధ్యతలు చేపట్టారు. ఎస్సై ఎన్.వంశీకృష్ణ మాట్లాడుతూ మండలంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు గాని, ఆరాచక కార్యకలాపాలు గానీ పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పదిమంది జూదరుల అరెస్టు..

విశాలాంధ్ర-ఓబులదేవరచెరువు: ఓబుల దేవరచెరువు కట్ట కింద జూదమాడుతున్న పది మంది నిందితులను సోమవారం మధ్యాహ్నం అరెస్ట్ చేసినట్లు ఎస్సై మల్లికార్జునరెడ్డి తెలిపారు. చెరువు కట్ట కింద పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి జూదరులను అరెస్ట్ చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.10,020ల నగదు, 10 సెల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఏఎస్సై రమణారెడ్డి కానిస్టేబుల్ కోలా అంజి, నరేష్, ప్రతాప్,లోకేష్ తదితర సిబ్బంది ఎస్ఐ వెంట ఉన్నారు.

స్మశాన వాటికకు స్థలం కేటాయించండి..

విశాలాంధ్ర-లేపాక్షి: లేపాక్షిలోని ఇందిరమ్మ నీలం రాజశేఖర్ రెడ్డి పిల్లిగుండ్లు కాలనీలలో స్మశాన వాటిక లేక ఇక్కడ జీవనం సాగిస్తున్న కుటుంబాలు చాలా ఇబ్బంది పడుతున్నాయని వెంటనే స్థలం కేటాయించాలని సిపిఐ పార్టీ మండల కార్యదర్శి శివప్ప, సీనియర్ నాయకుడు నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం కాలనీవాసులతో కలిసి తాహసీల్దార్ బాబుకి వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీ ఏర్పాటై 25 సంవత్సరాలు అయినప్పటికీ ఇంతవరకు స్మశాన వాటిక లేకపోవడం శోచనీయం అన్నారు. స్పందించిన తహసిల్దార్ పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి గౌతమ్ కుమార్, నారాయణప్ప, బాలు, చలపతి, శ్రీరాములు పాల్గొన్నారు.

పత్తి యాత్రికులకు భోజనం పంపిణీ

విశాలాంధ్ర-ధర్మవరం: కోనసీమ నుండి పుట్టపర్తికి పత్తి యాత్రగా వచ్చిన 260 మంది బాబాను దర్శనం చేసుకుని, తిరిగి కోనసీమకు వెళ్లే సమయంలో రైలు ధర్మవరం దగ్గర ఆగింది. పట్టణంలోని శ్రీ సత్య సాయి సేవా సమితి కన్వీనర్ ప్రసాద్ ఆధ్వర్యంలో సేవాదళ్ సభ్యులు యాత్రికులకు భోజనపు ప్యాకెట్లను పంపిణీ చేశారు. రైల్వే స్టేషన్ మాస్టర్ చల్లా నరసింహ నాయుడు మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషిం చదగ్గ విషయమని, సేవ సమితి కన్వీనర్ ప్రసాదుకు సిబ్బందికి కృతజ్ఞతలను తెలిపారు.

తనకల్లు నూతన ఎస్సై బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర-తనకల్లు: మండలానికి నూతన ఎస్సైగా రాజశేఖర్ బాధ్యతలు సోమవారం స్వీకరించారు. వజ్రకరూరులో విధులు నిర్వ హిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చానని తెలిపారు. శాంతిభద్రతలకు ఆటంకాలు కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నామని ఎస్ఐ చెప్పారు. పోలీస్ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

అమరవీరుల ఆశయాలను సాధిస్తాం..

విశాలాంధ్ర-ధర్మవరం: అమరవీరుల ఆశయాలను సాధిస్తామని ఏఐఎస్బి పట్టణ అధ్యక్షులు చిన్న వెంకీ, పట్టణ ప్రధాన కార్యదర్శి నందగోపాల్ తెలిపారు. సోమవారం పట్టణంలోని స్థానిక ఎస్సీ బాయ్స్ హాస్టల్ లో విప్లవ కెరీటం చేగువేరా 95 వ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. అనంతరం చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. చేగు వేరాను స్ఫూర్తిగా తీసుకొని రాబోయే రోజుల్లో ఖచ్చితంగా అన్యాయ అక్రమ పాలన ఎండగడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్బి పట్టణ ఉపాధ్యక్షులు జైపాల్, నాయకులు ప్రదీప్, హేమాద్రి, మంజు, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

21న ధర్మవరంలో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ఎన్జీవో హెూంలో ఈ నెల 21న పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా రక్త బంధం సొసైటీ సంస్థ ఆధ్వర్యంలో పోలీసుల సహాయ సహకారాలతో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రక్త బంధం సొసైటీ అధ్యక్షులు కన్నా వెంకటేష్ తెలిపారు. కర్నూలులోని తలసేమియా చిన్నారులకు రక్తదాతల ద్వారా ఇచ్చిన రక్తాన్ని అందిస్తామన్నారు. ముఖ్యఅతిథిగా డీఎస్పీ శ్రీనివాసులు వన్‌టౌన్ సిఐ సుబ్రహ్మణ్యం హాజరవుతారని, రక్తదాతలు 9391553146, 9502904679కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు

అక్రమ తవ్వకాలపై చర్యలు చేపట్టండి

విశాలాంధ్ర-ధర్మవరం: రేగాటిపల్లి రెవెన్యూ గ్రామములోని సర్వేనెంబర్ 435, 420,457,339లలో గల కొండలు మాయమవుతున్నాయని, అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు సీనియర్ నాయకులు కోటిరెడ్డి రాజారెడ్డి, మత్స్యకార వికాస విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెస్త శ్రీనివాసులు, లింగాల ప్రకాష్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఆబు, రాము, చిలమత్తూర్ మూర్తి, కార్య నిర్వహణ కమిటీ సభ్యులు కోటికి రామాంజి, తలారి ప్రతాపులు వినతిపత్రాన్ని అందజేశారు. తవ్వకాలపై తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

తపాలా సేవలు ప్రజల కోసమే..

విశాలాంధ్ర-ధర్మవరం: తపాలా శాఖ అందించే అన్ని సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రధాన తపాలా శాఖ పోస్ట్మాస్టర్ ఎం.వెంకట రామిరెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని కాయగూరల మార్కెట్ వద్ద గల ప్రధాన పోస్ట్ ఆఫీస్ లో సిబ్బంది ఆధ్వర్యంలో ప్రపంచ తపాలా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. తపాలా సేవా కార్యక్రమాలు ఖాతాదారులకు తెలియజేసి వాటి ఉపయోగాలను గూర్చి కూడా తెలపడం జరుగుతుందన్నారు. ప్రమాద బీమా సౌకర్యం కూడా ఉందన్నారు. పట్టణంలోని ఏ బ్యాంకులు అయినా సరే ఆధార లింకు ఉన్నట్లయితే (ఏఈపిఎస్) తమ తపాలా కార్యాలయంలో డబ్బులు డ్రా చేసుకునే అవకాశం కూడా కలదని తెలిపారు.

పేదలకు సేవ చేయడంలోనే తృప్తి ..

విశాలాంధ్ర-ధర్మవరం: పేదలకు సేవ చేయడంలోనే తృప్తి ఉందని వాసవి నారాయణ సేవా సమితి ఆర్గనైజర్ ఓవి ప్రసాద్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కలవల మురళీధర్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 350 మంది రోగులకు దాతలైన శివప్రసాద్ దంపతుల చేతుల మీదుగా భోజనాన్ని పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ నజీర్ సేవా సమితికి ఆర్యవైశ్య సంఘానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు బాలాజీ, గర్రె బాబు, యతిరాజుల ప్రసాద్ పాల్గొన్నారు.

అక్రమ అరెస్టు కక్ష సాధింపు చర్యే.. : పల్లె

విశాలాంధ్ర-పుట్టపర్తి : చంద్రబాబు అరెస్టు కక్ష సాధింపు చర్య అని మాజీ మంత్రి రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం అక్రమ అరెస్టును నిరసిస్తూ పుట్టపర్తి తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన రిలే నిరాహార దీక్షలో భాగంగా ఏర్పాటుచేసిన శిబిరంలో తెలుగుదేశం నాయకులు గుండ్లు కొట్టించుకుని విన్నూతనంగా నిరసన తెలియజేశారు. కర్ణాటకనాగేపల్లికి చెందిన రిక్షా తొక్కే కార్మికుడు నాగభూషణ మరియు అమడగూరు మండలానికి చెందిన ఎం. కృష్ణారెడ్డి(ఎక్స్ సింగిల్ విండో ప్రెసిడెంట్, ఎక్స్ ఎంపీటీసీ) ఇద్దరు చంద్రబాబు నాయుడికి మద్దతుగా రిలే దీక్ష శిబిరంలో గుండ్లు కొట్టించుకుని నిరసన తెలియజేశారు.

పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను నాశనం చేశాడని. పెట్టుబడులన్నీ పక్క రాష్ట్రాలకు తరలి వెళ్ళిపోతున్నాయని వాపోయారు. ఎన్ని కుయుక్తులు పన్నినా గెలిచేది న్యాయమేనని పల్లె ధీమా వ్యక్తం చేశారు. స్కిల్ డెవలప్మెంట్ స్కామ్ అంటూ చంద్రబాబుని ఏదో ఒక రకంగా ఇరికించడానికి జగన్ ప్రయత్నిస్తూ ఉన్నాడని అవినీతి జరగలేదన్నది వాళ్ళకి తెలిసినా ఎన్నికలు వచ్చే ముందు అరెస్టు చేసి ఆయనపై ప్రజల్లో ఉన్న ప్రజాభిమానాన్ని దెబ్బతీయాలని చూస్తున్నారని మండిపడ్డారు.

జగనన్న ఆరోగ్య సురక్ష గొప్ప వరం ..

విశాలాంధ్ర-సోమందేపల్లి: సోమేందపల్లి, అక్టోబర్ 9:జగనన్న ఆరోగ్య సురక్షకార్యక్రమం పేద ప్రజలకు గొప్ప వరం లాంటిదని, జిల్లా ప్రత్యేక అధికారి, ఏపీ జెన్కో ఎండి కె వివిఎస్ చక్రధర్ బాబు, కలెక్టర్ పి అరుణ్ బాబు పేర్కొన్నారు. సోమవారం సోమందేపల్లి మండలం నందు జగనన్న సురక్ష శిబిరాన్ని, చాకర్లపల్లి హౌసింగ్ లేఅవుట్లను, మాగేచెరువు గ్రామ సచివాలయం భవన నిర్మాణం పనులను పరిశీలించారు. సోమందేపల్లి జి ఎస్ కాలనీ ఎంపీపీ పాఠశాలలో జగనన్న గోరుముద్ద కార్యక్రమాన్ని పరిశీలించారు కలెక్టర్ పి అరుణ్ బాబు, ఇంచార్జి జాయింట్ కలెక్టర్ కార్తీక్, జిల్లా వైద్య శాఖ అధికారి ఎస్వీ కృష్ణారెడ్డి, హౌసింగ్ పీడీ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, డీఈఓ మీనా పాల్గొన్నారు. సోమేందపల్లి ఎంపీపీ పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సందర్శించి పలు కౌంటర్ కేంద్రాలను ప్రారంభించారు. రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ఆలోచలతోనే "జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు.

చాకర్లపల్లి లే అవుట్ నందు ప్రతి ఒక్కరు ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని లబ్ధిదారులను ఆదేశించారు. జిల్లా ప్రత్యేక అధికారి క్షేత్రస్థాయిలో గృహాల లబ్ధిదారులతో మాట్లాడారు.

ఎక్స్‌ప్రెస్ రైల్వే జనరల్ బోగీలను పెంచాలి..

విశాలాంధ్ర-ధర్మవరం: ఎక్స్ప్రెస్ రైళ్లల్లో జనరల్ భోగిలను పెంచాలని కోరుతూ సోమవారం ధర్మవరం రైల్వే స్టేషన్ మేనేజర్ చెల్లా నరసింహ నాయుడుకు వినతి పత్రాన్ని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు సకల రాజా అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగిలు పెంచకపోతే ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలకు సిద్ధం అవుతాం మనీ తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్న రైల్వే శాఖ ప్రతి రోజు దేశంలో వివిధ ప్రాంతాలకు కోట్లాదిమంది ప్రజలు రైళ్లలోనే ప్రయాణం చేస్తున్నారు అని, రైల్వే శాఖ కూడా ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రైల్వే టికెట్ రేట్లు కూడా అందుబాటు ధర ఉండడం, సమయానికి అనుగుణంగా రైలు నడవడం మంచి పరిణామం అని వారన్నారు. కరోనా కారణంగా ప్యాసింజర్ రైలు నిలిపివేయడం తర్వాత తిరిగి పున ప్రారంభం కావడం లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలి అని డిమాండ్ చేశారు. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా రైల్వే శాఖ ఎక్కువ కృషి చేయాలని తెలిపారు.

చేగువేరా ఆశయాలను సాధిద్దాం..

విశాలాంధ్ర-శింగనమల: నార్పల మండలంలో ప్రపంచ విప్లవ ధ్రువతార చేగువేరా 56వ వర్ధంతి సందర్భంగా ఏఐఎస్ ఎఫ్ ఆధ్వర్యంలో నార్పల జూనియర్ కళాశా లలో చేగువేరా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఏఐఎస్ఎఫ్ శింగనమల నియోజక వర్గ కార్యదర్శి నవీన్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న అసమానతలు తొలగించాలని, సామ్రాజ్య వాదాన్ని వ్యతిరేకిస్తూ కదం తొక్కిన విప్లవజ్యోతి చెగువేరా అన్నారు. ప్రపంచ వ్యాప్తం గా అనేక దేశాలు విముక్తి కోసం పోరాడిన యోధుడు అన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు నాగేంద్ర, ముని జయ,ధన, సాషా,రాఘవ పాల్గొన్నారు.

పోరాడ యోధుడు చేగువేరా ..

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీలో సిఐటియు కార్యాలయం నందు సోమవారం చేగువేరా 56 వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సిపిఐ నాయకులు కామ్రేడ్ హరి అమెరికా చేసినా అరాచకాల నుండి క్యూబా ప్రజలను చైతన్యవంతులను చేసిన పోరాటాలు వివరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రమేష్, సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, తిప్పన్నా, వెంకటేష్, లక్ష్మీనారాయణ, పాల్గొన్నారు.

చంద్రబాబు విడుదల కావాలని పాదయాత్ర

విశాలాంధ్ర-పెనుకొండ: జిల్లా అధ్యక్షులు పార్థసారథి ఆధ్వర్యంలో చంద్రబాబు విడుదల కావాలని కోరుతూ పెద్ద చెరువు కట్ట ఆంజనేయ స్వామి గుడిలో పూజలు నిర్వహించి పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా ఊరి వాకిలి ఆంజనేయ స్వామి దేవాలయం కాశీ విశ్వేశ్వర దేవస్థానం వరకు పాద యాత్ర నిర్వహించారు. చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటికి రావాలని .. సైకో పోవాలని సైకిల్ రావా లని నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, సిపిఐ డివిజన్ కార్యదర్శి శ్రీరాములు, జనసేన నియో జకవర్గం కార్యదర్శి కుమార్, కృష్ణమూర్తి, సామకోటి ఆదినారాయణ, వెంకటరాముడు, కేశవయ్య పాల్గొన్నారు.